క్లుప్తంగా

మధుమేహంపై అవగాహన సదస్సు

రేణిగుంట: స్థానిక రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం మధుమేహంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ న్యూట్రీషియన్ జేసీ రెడ్డి మాట్లాడుతూ మధుమేహం వున్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఏఐఆర్ఆర్ఎఫ్ డివిజనల్ ప్రెసిడెంట్ డాక్టర్ యాదవరెడ్డి, కార్యదర్శి జి.జయంత్ కుమార్, చైర్మన్ హసన్ సాహెబ్, ట్రెజరర్ అన్బు, ఆఫీస్ బేరర్లు, సభ్యులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎస్ఐకు సన్మానం


విశ్వనాథనాయుడును సన్మానిస్తున్న ఎస్పీ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న విశ్వనాథనాయుడు గత నెల 30న ఉద్యోగ విరమణ పొందారు. వారిని శుక్రవారం తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు తన కార్యాలయంలో సన్మానించారు. వారి సేవలను ప్రస్తుతించారు. ఎస్ఐ విశ్వనాథనాయుడు 43 ఏళ్లపాటు సేవలు అందించారని తెలిపారు.

ఇళ్ల స్థలాల కోసం ధర్నా

సత్యవేడు: మండలంలోని కొత్తమారికుప్పం పంచాయతీలోని గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆందోళనకు నేతృత్వం వహించిన సీపీఐ నాయకుడు చిన్నిరాజ్ మాట్లాడుతూ, కొత్త మారికుప్పం గిరిజనవాడ సమీపంలో ఖాళీ స్థలాలను స్థానిక గిరిజనులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, స్థానికేతరులు ఆక్రమించిన భూమిని రద్దు చేసి పేదలైన దళితులు, గిరిజనులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతి పత్రం ఇచాఆచరుఉ. కార్యక్రమంలో గిరిజనులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

మందుబాబు వీరంగం


నడిరోడ్డులో పడుకున్న మందుబాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో మందుబాబుల బెడద ఎక్కువగా వుంటోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఒక మందు బాబు పూటుగా మద్యం సేవించి రోడ్డు మధ్యలో పడుకుని వీరంగం చేశాడు. పోలీసులు అతన్ని పక్కకు తీసుకువెళ్లి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూశారు. ఆలయం సమీపంలోని మూడో గోపురం గేటు వద్ద ఒక వ్యక్తి రోడ్డు పక్కన అడ్డంగా పడుకున్నాడు. రామచంద్ర హాల్ ఎదురుగా ఉన్న మద్యం దుకాణం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న మద్యం దుకాణాల్లో మద్యం సేవించిన వారు రోడ్డు మీదే పడిపోతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఘనంగా శుక్రవారం ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి ప్రాకారంలో ప్రదక్షిణ చేశారు. అనంతరం కొలువుతీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్లస్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శుక్రవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం భూమి పూజ చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ నిధులు రూ 68.30 లక్షల అంచనాతో ఇంటర్ విద్యార్థులకు బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ ల్యాబ్‌ల కోసం ఈ గదులను నిర్మిస్తున్నట్లు స్కూల్ హెచ్‌ఎం మనోహరి చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుమన్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వేణయ్య, ఎంఈఓ కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యం బంద్




ఖాళీగా దర్శమిస్తున్న వైద్యుల కుర్చీలు, వైద్యం కోసం వచ్చిన రోగులు, రోగికి వైద్యం చేస్తున్న మేల్ స్టాఫ్ నర్సు

- వైద్యుల ఆందోళనతో అందని సేవలు
- ఐదు రోజులుగా ఇబ్బందులు పడుతున్న రోగులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు సమస్యల సాధన కోసం ప్రభుత్వ వైద్యులు ఆందోళన బాట పట్టారు. ఐదు రోజులుగా డాక్టర్లు సమ్మెలో ఉండడంతో ఓపీ సేవలు పూర్తిగా బంద్ అయ్యాయి. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీకి వచ్చిన రోగులు నానా అవస్థలు పడ్డారు. నర్సులతో నామమాత్రపు వైద్యం చేయించుకుని వెళ్లిపోతున్నారు. ఇన్ సర్వీసు కోటాను పునరుద్ధరించాలని, టైమ్–బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50 శాతం ట్రైబల్ అలవెన్స్ ఇవ్వాలని, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రాం కింద వైద్యులకు రూ. 5 వేలు అలవెన్స్ ఇవ్వాలని, నేటివిటీ, అర్బన్ ఎలిజిబులిటీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలనే డిమాండ్లతో రాష్ట్రంలోని పీహెచ్‌సీల వైద్యులు ఆందోళన చేస్తున్నారు. అలాగే, పీహెచ్‌సీ వైద్యులకు కచ్చితమైన పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవులు ఇవ్వాలని, వైద్యులకు జాబ్ చార్ట్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నారు. ఇదే పరిస్థితి నియోజకవర్గంలోని అన్ని పీహెచ్‌సీలలోనూ నెలకొని ఉండడంతో అన్ని ప్రాంతాల్లోనూ రోగులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చి, ఇకనైనా వైద్యుల సమస్యలను పరిష్కరించి ఆస్పత్రులు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చూడాలని రోగులు కోరుతున్నారు.

ఎంపీని కలిసిన ఎయిర్‌పోర్ట్ సలహా మండలి సభ్యుడు

రేణిగుంట: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని గురువారం ఆయన కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, తిరుపతి ఎయిర్‌పోర్ట్ సలహా మండలి సభ్యుడు పన్నీరు కాలువ శ్రీధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవారి ప్రతిమను బహూకరించారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి సాదర వీడ్కోలు

రేణిగుంట: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి శుక్రవారం ఉదయం రేణిగుంట నుంచి వందే భారత్ రైలులో విజయవాడ బయలుదేరారు. ఈ క్రమంలో తిరుపతి నుంచి రోడ్డు మార్గాన రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఆయనను రేణిగుంటకు చెందిన వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు కలిశారు. ఆయనకు సాదరంగా వీడ్కోలు పలికారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, టైలర్స్ అసోసియేషన్ బలిజ సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు అంజూరు తారక శ్రీనివాసులు శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ యూత్ సురా సురేష్, ఉత్తరాది శరవణ కుమార్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

8న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వున్న హుండీలోని కానుకలను 8న లెక్కించనున్నట్టు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద వున్న హుండీల్లోని కానుకలను ఆలయ ఆవరణలోని కొట్టు మండపంలో లెక్కించనున్నట్టు తెలిపారు. ఆలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తప్పకుండా హుండీ లెక్కింపునకు హాజరుకావాలని ఆదేశించారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన


పాడి రైతులకు జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మునిరాజా

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పాడి రైతులు జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాఖ ఏడీఏ మునిరాజా కోరారు. జీఎస్టీ తగ్గింపుపై శుక్రవారం మండలంలోని కాటూరులో పాడి రైతులకు ఆయన అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు వస్తువుల కొనుగోలుపై జీఎస్టీ పన్ను భారీగా తగ్గించిందని, ఇది పాడి రైతులు ఎంతో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షణ్ముగం, ఏఈఓ రేవతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నూకతోటి రాజేష్, నారాయణవనంలో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ డిమాండ్
- దేవళంపేట ఘటనపై నిరసన

వరదయ్యపాళెం: వెదురుకుప్పం మండలం దేవళంపేటలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పంటించిన వారిని కఠినంగా శిక్షించాలని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి ఆగంతకులు నిప్పంటించిన ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే అదే ప్రాంతంలో నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి చర్యలు అప్రజాస్వామికమని దేవళంపేట ఘటనపై వరదయ్యపాళెం మండల అంబేడ్కర్ సేవా సంఘం అధ్యక్షులు చిన్నా ఒక ప్రకటనలో ఖండించారు. నిష్పక్షపాతంగా అధికారులు విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

నారాయణవనం: వెదురుకుప్పం మండలం దేవళంపేట సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు ఘటనలో దోషులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఉదంతాన్ని ఖండిస్తూ నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద క్యాండిల్స్ వెలిగించి ఈ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగ సంయుక్త కార్యదర్శి అన్నాదొరై, జిల్లా క్రియాశీల కార్యదర్శి రాకేష్ కిరణ్, వైస్ ఎంపీపీ శివశంకర్, సర్పంచ్ నాగూరు, నాయకులు గురుస్వామి, తిరువేంగడం, రామలింగం, గోవిందస్వామి, కైలాసం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి పాలకమండలిలో స్థానికులకు మొండి చేయి?

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆలయ పాలకమండలిని ప్రకటించినట్లు సోషల్ మీడియాలో శుక్రవారం ప్రకటన విడుదలైంది. అందులో స్థానిక కూటమి నాయకులకు ఆరుగురు ఉన్నట్టు పేర్కొన్నారు. మిగిలిన వారు స్థానికేతరులు. దీనిపై శ్రీకాళహస్తి పాలకమండలిపై ఆశలు పెట్టుకున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రస్టు బోర్డులో తామంటే తాము ఉంటామంటూ ప్రకటించుకున్న నేతలకు ఆశాభంగం కలిగినట్టు అయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్థానికులకు పెద్దపీట వేస్తూ 14 మంది సభ్యులు, మరో పదిమందిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వంలో స్థానికులకు అవకాశం కల్పించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇదే ఫైనల్ జాబితానా, లేక మార్పులు జరుగుతాయా అనేది వేచి చూడాల్సిందే.

ఉపాధి హామీపై గ్రామసభ


మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి శంకరయ్య

నాగలాపురం: అటవీ ప్రాంతాల్లో చేసే ఉపాధి పనులు తమకు ఉపయుక్తంగా ఉండేలా చూడాలని స్థానిక రైతులు కోరారు. శుక్రవారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ చిన్నదొరై సుధా అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈఓ, పంచాయతీ కార్యదర్శి శంకరయ్య మాట్లాడారు. అనంతరం వచ్చే ఏడాదిలో చేపట్టాల్సిన ఉపాధి హామీ పనులపై అధికారులు, గ్రామస్తులు చర్చించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డి మునిరత్నం, ఏపీఓ సుధాకర్, ఎఫ్ఏ బాలాజీ, ఏఎస్ఐ షణ్ముగం, ఉప సర్పంచ్ సునీత, వార్డు మెంబరు చిరంజీవి, ఉదయ్ కుమార్, గౌతమ్, నాయకులు ధనరాజ్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఫారెస్ట్ చెక్ పోస్ట్ సిబ్బంది దందా


లారీ డ్రైవర్‌ను డబ్బు డిమాండ్ చేస్తున్న దృశ్యం

తొట్టంబేడు: మండలంలోని బసవయ్యపాలెం వద్ద నున్న ఫారెస్ట్ చెక్ పోస్ట్‌లో సిబ్బంది దందా కొనసాగుతూనే వుంది. లారీ డ్రైవర్లను బెదిరించి యథేచ్ఛగా నగదు వసూలు చేస్తున్నారు. ఎవరైనా ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తే వారిపై దాడులకు దిగుతున్నారు. తమ వద్ద డబ్బులు లేవని డ్రైవర్లు చెప్పినప్పటికీ ఫోన్ పేలో పంపించమని డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం ఉదయం విధుల్లో ఉన్న ఫారెస్ట్ చెక్ పోస్ట్ అధికారి లారీ డ్రైవర్‌తో బలవంతంగా నగదు తీసుకున్నాడు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డ్రైవర్లు కోరుతున్నారు.

ఎంపీని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు


ఎంపీతో రేణిగుంట మండల నాయకులు

రేణిగుంట: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని శుక్రవారం ఆయన కార్యాలయంలో రేణిగుంట మండలానికి చెందిన డీసీసీబీ మాజీ చైర్మన్ సిద్ధగుంట సుధాకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తిరుమల రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అండగా వుంటామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోందని ఆరోపించారు.

అర్ధాంతరంగా ముగిసిన గ్రామ సభ


ఈవోను నిలదీస్తున్న స్థానికులు

రేణిగుంట: రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ నగేషం అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభ అర్ధాంతరంగా ముగిసింది. ముందుగా ఈవో మాధవి మాట్లాడుతూ పంచాయతీలో చేపట్టిన వివిధ పనుల గురించి వివరించారు. స్థానికులు ఆమెకు అడ్డుతగిలారు. మండలంలో 108 వాహనం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధి దీపాల మరమ్మతుల కాంట్రాక్ట్ నిలిపేసిన నేపథ్యంలో తనకు బకాయిలు చెల్లించాలని నరేష్ కోరారు. ఈ క్రమంలో అతనికి ఈవోకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎంపీటీసీ రాజేశ్వరి, వీఆర్ రావణ తదితరులు పలు అంశాలపై నిలదీయడంతో ఈవో అసహనం వ్యక్తం చేశారు. దీంతో సర్పంచ్ గ్రామసభను ముగిస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. ఏపీవో దీప, ఏపీఎం కోమల తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి భక్తుల విరాళాలు



విరాళం అందజేస్తున్న తుపాకుల రమేష్ దంపతులు, విరాళం అందజేస్తున్న రెబ్బ సునీల్‌కుమార్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. తిరుపతికి చెందిన తుపాకుల రమేష్ దంపతులు రూ.25,116, హైదరాబాద్‌కు చెందిన రెబ్బ సునీల్‌కుమార్ రూ.50 వేలు ఇచ్చారు. నగదును ఈవో బాపిరెడ్డికి అందజేశారు. ఆయన వారికి స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి


రేణిగుంట: గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు


నారాయణవనంలో..


పిచ్చాటూరులో..

రేణిగుంట: పట్టణంలో గురువారం గాంధీ జయంతిని వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. బస్టాండ్ కూడలిలో వున్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ నగేషం, వైఎస్సార్ సీపీ మైనార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్, కో ఆప్షన్ సభ్యులు హసన్ సాహెబ్, జాన్ బాబు, ఇన్బనాథన్, మస్తాన్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: గాంధీ జయంతి పురస్కరించుకుని గురువారం సచివాలయంలో ఆయన చిత్రపటానికి సర్పంచ్ వెంకటమ్మ, గ్రామ కార్యదర్శి పెంచలయ్య, టీడీపీ నాయకుడు సుధాకర్‌నాయుడు, ఉపసర్పంచ్ మునిరాజా పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.

పిచ్చాటూరులో..

నాగలాపురం: పిచ్చాటూరులో పూర్వ విద్యార్థులు గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక గాంధీనగర్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి, ఆ తర్వాత ఆయన చిత్రపటానికి విశ్రాంత హెచ్‌ఎం నాగయ్య రామలింగం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ రోసిరెడ్డి, యోగా గురువు థామస్, నాయకులు కేటీ.హరిశ్చంద్రారెడ్డి, పూర్వ విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చిన్నదొరై సుధా, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు గాంధీ చిత్రపటానికి పటానికి, అనంతరం టవర్ క్లాక్ కూడలి వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి స్వీట్లు పంచారు. ఉప సర్పంచ్ సునీత, నాయకులు అపరంజిరాజు, రాజామణి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: స్థానిక గాంధీ మండపం వద్ద గాంధీ విగ్రహానికి పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, వార్డు సభ్యులు, చేనేత కార్మికులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే, మండల వ్యాప్తంగా పంచాయతీ కార్యాలయాల్లోనూ వేడుకలు నిర్వహించారు.

రుతుక్రమంపై అవగాహన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం ఎంపేడు పీహెచ్‌సీలో శుక్రవారం విజయవాహిని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రుతుక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో సుమారు 80 మంది ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళల్లో ఏర్పడే రుతుక్రమం, ఆ సమయంలో గర్భాశయంలో కలిగే మార్పులపై వివరించారు. అలాగే మార్కెట్‌లో లభించే పలు మెన్స్ట్రువల్ ప్రొడక్ట్స్, వాటి వినియోగంపై ఎంహెచ్‌ఎం ప్రోగ్రామ్ అసోసియేట్ కుసుమ వివరించారు.

నత్తనడకన జీర్ణోద్ధరణ పనులు


జీర్ణోద్ధరణ పనులను త్వరగా పూర్తి చేయాలని వినతి పత్రాన్ని హుండీలో వేస్తున్న గ్రామ పెద్దలు

నాగలాపురం: మండలంలో ప్రసిద్ధిగాంచిన టీటీడీ అనుబంధ శ్రీ వేదవల్లి సమేత వేద నారాయణ స్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ పనులు నత్తనడకన సాగుతున్నాయని గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయంలో రెండేళ్లుగా సూర్యపూజ, బ్రహ్మోత్సవాలు పూర్తిగా ఆగిపోయాయని, ఆలయంలో బాలాలయ పనుల నేపథ్యంలో భక్తులు ఉత్సవమూర్తులను చూసి దర్శించుకుటుంన్నారని గ్రామపెద్దలు చెప్పారు. సమస్యలపై శుక్రవారం ఆలయ అధికారి చెంగల్ రాయులుకు వినతి పత్రం ఇవ్వడానికి గ్రామస్తులు యత్నించడంతో ఆయన నిరాకరించారు. దీంతో వినతి పత్రాన్ని ధ్వజస్తంభం వద్ద ఉన్న హుండీలో సమర్పించారు. సమస్యలను టీటీడీ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఇకనైనా ఆలయ జీర్ణోద్ధరణ త్వరగా పూర్తి చేసి భక్తుల దర్శన భాగ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

భక్తిప్రపత్తులతో విజయదశమి



రేణిగుంట: చక్రస్నానం నిర్వహిస్తున్న వేద పండితులు, నారాయణవనం: కరెన్సీ నోట్ల అలంకరణలో అమ్మవారు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామదేవత వేమలమ్మ, పల్లమాల గ్రామదేవత పచ్చాలమ్మ, నీర్పాకోట గ్రామదేవత చెంగాళమ్మలకు గురువారం ఘనంగా పూజలు చేశారు. అమ్మవారి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. బుచ్చినాయుడుకండ్రిగలో స్థిరపడిన రాజస్థాన్‌కు చెందిన వ్యాపారులు మహిళలతో కలసి వేసిన దాండియా నృత్యం ఆకట్టుకుంది. స్థానిక సచివాలయంలో సర్పంచ్ వెంకటమ్మ, గ్రామ కార్యదర్శి పెంచలయ్య, ఉపసర్పంచ్ మునిరాజా విజయదశమి పూజలు చేశారు.

కరెన్సీ నోట్ల అలంకరణలో ధనలక్ష్మి

నారాయణవనం: స్థానిక రామాలయంలో గురువారం అమ్మవారు కరెన్సీ నోట్లు, చిల్లర నాణేలతో ధనలక్ష్మిగా ఊంజల్‌సేవలో దర్శనమిచ్చారు.

గాజుల అలంకరణలో రాజరాజేశ్వరి దేవి

సత్యవేడు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురు, శుక్రవారాల్లో రాజరాజేశ్వరి దేవి గాజుల అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారికి అలంకరించిన గాజులను రెండ్రోజుల అనంతరం మహిళలకు పంపిణీ చేస్తామని, ఆలయ ధర్మకర్త రవికుమార్ దేవర్ తెలిపారు.

ఘనంగా ముగిసిన దసరా ఉత్సవాలు

రేణిగుంట: మండలంలోని ఎలమండ్యం గ్రామ చెరువులో వెలసిన శ్రీ పొక్కలమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా నవరాత్రి మహోత్సవాలు గురువారం ముగిశాయి. చివరి రోజు గురువారం తెల్లవారుజామున అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. మాజీ జెడ్పీటీసీ తిరుమల రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ సిద్ధాగుంట సుధాకర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. నాయకులు గంగయ్య, గుణశేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి, జీవానంద రెడ్డి, ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన దసరా ఉత్సవాలు

శ్రీకాళహస్తి: పట్టణంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు గురువారం ముగిశాయి. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కనక దుర్గమ్మ పూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీకాళహస్తి మండలం వేడాంలో వున్న దక్షిణ కాళికాదేవి, బజారువీధిలోని కన్యకా పరమేశ్వరిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే పట్టణంలోని పలు ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా అమ్మవారి చక్రస్నానం

రేణిగుంట: రేణిగుంట బిస్మిల్లా నగర్‌లో వున్న రాజరాజేశ్వరి దేవి జ్ఞానపీఠంలో పీఠాధిపతి మూర్తి స్వామి ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను తొమ్మిది రోజులు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు శుక్రవారం అమ్మవారి ఉత్సవమూర్తులకు చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. అనంతరం ధ్వజావరోహణం చేసి ఉత్సవాలను ముగించారు. మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.